

# 23 ప్రజా ద్రోహ కథ

"మరెల్క్షనుకి నిలబడే మాటేం జెప్పావు?" అన్నారు రామిరెడ్డిగారు.

"ఎవరూ?" అన్నట్టుగా చూశాడు సుబ్బరాజు.

"ఇంకెవరు నివ్వే"

సుబ్బరాజు నవ్వాడు.

"ఆయన నామినేషను పడేశాడుగా" అన్నాడు క్షణం ఆగి.

"దానికేటి, పడేస్తే తీసేస్తాడు"

"అది సరే, ఈసారికిలా పోనిద్దాం, మీమీద ఆశ బెట్టుకున్నాడు...." అన్నాడు సుబ్బరాజు.

"అదిసర్లే. ఓ కథ చెబుతా విను...." అంటూ కథ ఆరంభించారు రెడ్డిగారు.

"ఓనాడు సందేళ ఇది గిలాగే ఓ పార్టీ పెద్దరెడ్డి, ఆయన బలగం కూర్చొని రాబొయ్యే ఎల్క్షను గురించి మాటాడుతున్నారు సావిట్లో. అంతలో దూరంగా గేటవతల జటకా ఆగింది. అందులోంచి ఓ నడికారు మనిషి దిగాడు. దిగి లోపలి కొస్తున్నాడు. ఆయన్ని, ఆ తేజస్సుని చూడగానే అందరికీ మాట లాగిపోయాయి. మసకెల్తురేమో మనిషెవరో గుర్తు తెలీలేదు. ఎవుడో సీవదొర లాగున్నాడన్నారు. శాపం తగిలిన మినీస్టర్నిన్నారు. కాదుత్తరాది నాయకుడన్నారు.... అంతలో ఆయన రానే వచ్చాడు. చౌదరిగారు ఆ వూరోడే. ఎల్క్షనయి రాజధాని కెళ్ళి శాన్నాళ్ళయింది. ఇదే రాక. తెలిసినోళ్ళు కూడా మరిచేపోయారు – ఆయనోడు తమ తరఫున ఎక్కడో పన్జేస్తున్నాడని.... ఆయన్రాగానే పెద్దిరెడ్డిగారు లేచి నిలబడి ఎదురెళ్ళి తీసుకొచ్చి కూచోబెట్టాడు. కుశల వడిగాడు. ఇదిగో ఇది నా రాజ్యం. కావాలంటే ఇదంతా మీదే. మేం నీ వోళ్ళం అన్నాడు రెడ్డిగారు. అంత మాటెందుకన్నాడో ఆయన ఎత్తేమిటో అందరికీ తెలీదుగాని ఏదో లేందే అనడని తెలుసు. స్తిమితపడ్డాక రెడ్డిగార్ని గదిలో కూర్చోబెట్టుకుని చౌదరిగారు తన కథ చెప్పకొచ్చాడు.

పార్టీ ఇంద్రుడు ఆయనకి శాపం బెట్టాడు. పబ్లీకున్నలుగురికీ తెలిసిపొయ్యేటంత ఇదిగా డబ్బు గడించేస్తున్నాడనీ, పరువుర్దీసి పందిర్లేస్తున్నాడనీ తెలిసిందట. దానికితోడు, తన్ను ఎన్నుకున్న జనం వస్తే మొఖం చాటేశాడనీ, కంట్రకం అయేంతగా తిక్కలు పొయ్యాడనీ తెలిసింది. పేపర్లలో దీన్ని గురించి రాశారట. దాంతో ఆయన

క్కోపంవచ్చి, 'ఓయీ చౌదరయ్యా, నివ్వెళ్ళి కొన్నాళ్ళుపాటు ప్రజల్లో కలిసిపోయి వొనవాసం జెయ్యి. నీకింతే శాస్తి' అని శాపం బెట్టాడు. ఈన బరి తెగించెదిరించి పార్టీ నొదిలి స్వతంత్రుడుగా తిరిగాడు. ఇప్పటికి టైమైంది. ఈ దఫా ఎలక్షనుకి టిక్కెట్లివ్వనన్నాడు ఇంద్రుడు. ఇచ్చినా ఎన్నుకోమన్నారు ఆ వాడ ప్రజల మనుషులు. సర్లే సూసుకో. నేనే తిరిగి ఎలక్షనయి నీ ఎదురుగుండా నిలవకపోతే, వీలైతే మంత్రి నవకపోతే చూసుకో అని శపథం బట్టి వొచ్చేశాడు చౌదరిగారు, అద్గదీ కత.

పెద్దిరెడ్డిగారికి ఆ పార్టీ ఇంద్రుడి మీద శాన్నాళ్ళుగా పంతం వుంది. పగ కాదు సుమా. బావామరుదుల వొరసగా సరసాలాడుకుంటా రిద్దరూ ఎపుడన్నా కలిస్తే. కాని బలాబలాలు చూసుకోవాలనే ఉబలాటాలుండి పొయ్యాయి. సర్లేవయ్యా శరణొచ్చాను. నిన్నే నిలబెడతాను అన్నాడు రెడ్డిగారు. చౌదరిగారికాడ డబ్బూ ట్టేలేదు కూడాను, అయినాసరే నన్నాడు రెడ్డిగారు.

బావగారి క్కబురంపాడు, ఇక్కడ మా చౌదర్ని తప్ప మరొకర్ని పెడితే నెగ్గరని, దరిమిలాను స్వయంగా వెళ్ళి వాదించాడు. అపైన తన గ్రూపుల బలం చూపి నచ్చజెప్పాడు. పట్టిదుపుల ఒడుపులు దెలిసిన ఇంద్రుడు పకాల్న నవ్వి బయటకొచ్చి వొరండాలో కూర్చున్న చౌదర్ని కౌగిలించుకొని లోపలికి దీసుకువెళ్ళాడు. "నాకేం వుందయ్యా, మీ నియోజకవర్గంలో జనానికి మోజు విరిగి పొయ్యిందనీ, అసలు మర్చిపొయ్యారనీ అక్కణ్ణించి వుత్తరాల్రాశారు. గిట్టనోళ్ళని వూరుకున్నాగాని శానామంది రాసేతలికి, మరీ ఇంతమందయితే ఇక లాభవేటని అలా చెప్పాను. నాదేముంది? నెగ్గితే నెగ్గు, టిక్కటిస్తాను" అన్నాడు.

చౌదరి మొఖవింతయింది. పెద్దిరెడ్డిగారు నవ్వి దానికేంవుంది అది నే జూసుకుంటానన్నారు. అనుకున్నంత సులభంగా లేదు పని. వూళ్ళో శానామంది కిష్టంలేదు, చౌదరి అంటే. కొంతమందికి అసలే అభిప్రాయంవూ లేదు, ఆయనెవుడో తెల్దన్నట్టు మాటాడారు. ఈ లెక్కని పార్టీ టిక్కట్టు మీద నిలబెడితే చాలా కంట్రకం అవుతుందనిపించింది రెడ్డిగారికి. అందుకో ఉపాయంవాలోచించాడు.

సర్లే, మీకు గురిలేకపోతే ప్రస్తుతానికి ఇండిపెండెంటుగానే నిలబడతాళ్ళే, ఆనాక జూసుకోవచ్చునని పైకి కవురంపాడు రెడ్డిగారు. చౌదరి స్వతంత్రుడుగా నిలబడ్డాడు. ప్రచారానికి సన్నాహాలు ఆరంభించారుగాని పెద్దిరెడ్డిగారు ఉత్సాహం జూపలే. ఎందుకూ డబ్బు దండగ అన్నారు, చెడవుద్దని వెనకాడుతున్నాడు గాబోలని చౌదరి కంగారు పడ్డాడు. అంతలో అదృష్టం బాగుపడి, బే వారసత్వం ఒకటి దారికొచ్చి డబ్బు తగిలింది, లంకె బిందెలే అనుకో.

ఇహ డబ్బు తగలేద్దారి పట్టండి అన్నాడు చౌదరి.

పెద్దిరెడ్డిగారు నవ్వాడు. "నివ్వంటే ఇష్టం లేదన్నాళ్ళ మీద ఎందుకు గుప్పించడం డబ్బు? ఓటుల్లేకపోతే గెలవ్వా?" అన్నాడు. చౌదరి తెల్లబోయి ఇదేవిటన్నాడు. ఇంకో క్షణాని కతనికే తోచింది దానర్థం.

"నిజవే, ఇలా వెదజల్లి అళ్ళందరినీ తడిపి, హైరానా పడే బదులు 'ఇలాగే' చెయ్యొచ్చుగా" అన్నాడు.

మర్నాడే రాయబారాలారంభించాడు.

గుట్టు చప్పుళ్ళేకుండా గుంభనగా నడిచాయి.

ఎదరివాళ్ళిద్దరికీ చెరి డెబ్బై అయిదువేలూ పరిహారం ఇచ్చే పద్ధతి మీద ఒప్పందాలు కుదిరాయి. అంతలో, ఒకాయనకి పక్షవాతమొచ్చి పడిపొయ్యాడు. అక్కడితో ఆయనకిచ్చే డబ్బు ఆదా అయింది. డెబ్బై ఐదువేలు కలిసొచ్చిందని సంతోషించబోయాడు చౌదరి. పెద్దిరెడ్డిగారు అదోలా నవ్వారు. ఇంకో గంటకి రెండో ఆయన దగ్గర్నించి కబురొచ్చింది. "నేను నామినేషను తీసేసుకోటం లేదూ, నిలబడుతున్నానూ" అని.

రెడ్డిగారూ చౌదరిగారూ పరుగెత్తారు. గిరాకీ పెరిగింది గాబట్టి లక్షా యాభై దగ్గర బేరం పెట్టాడవతల పెద్దమనిషి, గంటయ్యేసరికీ, చచ్చి చెడి లక్షకి దింపారు. సాయంత్రానికి ఆ నామినేషను కూడా పోయింది.

చౌదరిగారు ఎన్నికయినట్టు మర్నాడు పేపర్లలో పడింది. ఇష్టం వున్న పేపర్లు 'ఏకగ్రీవంగా' అని రాశాయి. లేనివి 'పోటీ లేకుండా' అని రాశాయి, చౌదరీ, రెడ్డిగారూ పగలబడి నవ్వుకున్నారు.

ఆ వాడ ప్రజలు నిర్ఘాంతపోయారు.

"సుబ్బరాజా! నీకా ప్రజ్ఞ వుందా? ప్రజల్ని బోల్తా కొట్టించి నెగ్గిన చౌదరిగారికి ఏం బహుమతి ఇస్తావు? లేదా అది ద్రోహంవనుకుంటే ఏంవి శిక్షవేస్తావు?" అన్నారు రామిరెడ్డిగారు కథ ఆపి.

"ప్రజాద్రోహి చౌదరిగారు కాదు. డబ్బు తీసుకుని నామినేషను ఉపసంహరించుకున్న అవతలి పెద్దమనిషి. చౌదరికి శిక్ష వెయ్యడం కష్టం. ఎలక్షను కడతేరా నడిపించి, ఆయనకెందరు ఓట్లు వేస్తారో చూడాలి. ఉన్న ఓటర్లలో నూటికేభై మందికి పైగా ఆయనకి ఓటేస్తే నెగ్గినట్టు....లేపోతే...."

"ఛఛఛ. పరువు దీశేశావు సుబ్బరాజా. కడుపులో ఇలాటూహాలు బెట్టుకుని పొలిటిక్సులోకెల్లా దిగావయ్యా" అన్నారు రెడ్డిగారు.

* * *